క్లుప్తంగా

ఆర్టీసీలో సమయపాలన మాసోత్సవాలు


ఆర్టీసీ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎం రమేష్

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోలో సమయపాలన మాసోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను డిపో మేనేజర్ కె.రమేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులు పరిశుభ్రంగా, మంచి కండిషన్‌లో ఉండేలా మెయింటెయిన్ చేయాలని సిబ్బందికి సూచించారు. కండక్టర్లు, డ్రైవర్లు సమయపాలన పాటించాలని, ప్రయాణికుల మన్ననలు పొందేలా సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజి, సెక్యూరిటీ, ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

బొండపల్లి: రాచకిండాం గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్య నారాయణ, వైద్యారోగ్యశాఖ జిల్లా టాస్క్‌ఫోర్సు బృందం శనివారం తనిఖీలు నిర్వహించింది. కేంద్రం పరిధిలో బాలింతలు, గర్భిణులు,చిన్నారుల వివరాలు, వారికి అందిస్తున్న వైద్యసేవలపై సిబ్బందిని ఆరాతీశారు.రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీపీహెచ్‌ఎన్ సత్యవతి, ఎస్‌ఓ రాంబాబు, డీపీఎం రామానుజులునాయుడు, హెల్త్ సూపర్ వైజర్ ఎస్.ఏ.బాషా, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎంఎల్‌హెచ్‌పీలు షర్మిళ, హారిక పాల్గొన్నారు.

బ్యాంకర్లు లక్ష్యాలను చేరుకోవాలి


మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి

చీపురుపల్లి: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు చేరుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ వి.వి.రమణమూర్తి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం చీపురుపల్లి, గరివిడి మండలాల సంయుక్త స్థాయి బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా స్వయం సహాయక సంఘాలకు సకాలంలో రుణాలు అందజేయాలన్నారు. అలాగే వారి నుంచి పొదుపు కూడా కట్టించుకోవాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరవుతున్న పీఎంఈజీపీ వంటి రుణాల లక్ష్యాలను శతశాతం పూర్తి చేయాలన్నారు. నాబార్డు డీడీఎం నాగార్జున, డీపీఎం రాజ్‌కుమార్, వెలుగు ఏపీ బంగారమ్మ, ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, చీపురుపల్లి, గరివిడి మండలాల్లోని అన్ని బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ


వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

చీపురుపల్లి: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ బి.నాగలక్ష్మి వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై వ్యవసాయశాఖ సిబ్బందికి మండల కేంద్రంలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కొనుగోలు కేంద్రానికి అవసరమైన తూనిక, ఇతర యంత్రాలను సరఫరా చేస్తామని చెప్పారు. పొరపాట్లకు తావివ్వకుండా నిబంధనల ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని, వివరాలన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. తహసీల్దార్ ఎస్.రాజారావు, వ్యవసాయశాఖ ఏడీ ఎన్.కోటేశ్వరరావు, ఏఓ సీహెచ్.రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం


చంద్రశేఖరం రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

బొండపల్లి: తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీఈఓ యు.మాణిక్యంనాయుడు అన్నారు. రాచకిండాం హైస్కూల్‌లో బ్రహ్మశ్రీ కట్టమూరి చంద్రశేఖరంతో నిర్వహించిన అష్టావధానం కార్యక్రమానికి డీఈఓ అతిథిగా హాజరయ్యారు. కట్టమూరి చంద్రశేఖరమ్ రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని చాటేందుకు భాషా ప్రావీణ్యాన్ని వెలికి తీయడానికి అష్టావధానాలు ఏంతగానో దోహదపడతా యని చెప్పారు. ఎంఈఓ అల్లు వెంకటరమణ, హెచ్‌ఎం టి.సన్యాసిరాజు, విశ్రాంత ఎలక్ట్రికల్ ఏఈ నగుడు అప్పలనాయుడు, ప్రముఖ గేయ రచయిత పాయల మురళీకృష్ణ, ఎస్.సోమేశ్వరరావు,దాలినాయుడు, కుసుమంచి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

- విద్యార్థులకు అపార్ కార్డులు జారీ చేసేందుకు పాఠశాలల్లో వివరాల నమోదు
- ఆధార్‌లో తప్పులతో అపార్ నమోదుకు తిప్పలు
- పేర్లు, పుట్టిన తేదీల్లో తేడాలు
- వివరాలు సరి చేసుకునేందుకు మీసేవ కేంద్రాలు, సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రదక్షిణలు


జామి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

అపార్ కష్టాలు



అపార్ కార్డు నమూనా

ఎస్.కోట నియోజకవర్గంలో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు, నవంబర్ 14 నాటికి పూర్తయిన అపార్ నమోదు వివరాలు		
మండలం	విద్యార్థుల సంఖ్య	అపార్ నమోదు పూర్తయిన వారు
జామి	5,505	4,533
కొత్తవలస	8,839	7,324
ఎల్.కోట	3,743	3,138
ఎస్.కోట	9,140	6,662
వేపాడ	3,045	2,277

జామి: నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ ఉండాలనే నినాదంతో.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న ప్రతీ విద్యార్థికి ఒక నెంబర్ కేటాయించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో కార్డుల జారీకి విద్యార్థుల వివరాల నమోదు ప్రారంభించింది. ఈ ప్రక్రియను పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల్లో యాజమాన్యాలకు అప్పగించింది.అపార్ నమోదు కోసం విద్యార్థి, తల్లి,తండ్రి ఆధార్ కార్డులను పాఠశాల, జూనియర్ కళాశాలల్లో స్థాయిలో మ్యాపింగ్ చేయాలి. గత నెల రోజులుగా పాఠశాలలు, కళాశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్‌లు, నిర్వాహకులు ప్రత్యేక దృష్టిసారించి, విద్యార్థుల వివరాలను అపార్‌లో నమోదు చేస్తున్నారు. విద్యార్థుల జననధ్రువీకరణ పత్రం, పాఠశాలల రికార్డుల్లో, ఆధార్‌కార్డులో పుట్టినతేదీ, పేర్లు ఒకే రకంగా ఉంటేనే నమోదవుతుంది. కొందరు విద్యార్థులకు జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, కొంతమంది పేర్లు ఆధార్ కార్డుల్లో ఒక విధంగా, పాఠశాలల రికార్డుల్లో మరో విధంగా ఉండడం, తల్లిదండ్రుల పేర్లుకూడా స్కూళ్ల రికార్డుల్లో ఒకలా, ఆధార్ కార్డుల్లో ఒక విధంగా ఉండడంతో అపార్ నమోదు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పేర్ల విషయంలో ఇంగ్లిష్ అక్షరాల్లో ఒక్క అక్షరం తప్పుగా ఉన్నా ఈ నమోదు నిలిచిపోతోంది. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న విద్యార్థి వివరాలకు సమానంగా ఆధార్‌లోని విద్యార్థి వివరాలు సరిపోల్చి ఉండాలి. జూనియర్ కళాశాల విద్యార్థులకు పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ ఆధారంగా నమోదు చేస్తుండడంతో వారి విషయంలో పెద్ద సమస్యలు లేవు. విద్యార్థులు జనన తేదీలు పాఠశాలల్లో ఉన్న విధంగా ఆధార్ కార్డుల్లో లేకుంటే వాటిని ఆధార్ కార్డుల్లో సరిచేయాల్సి వస్తోంది. ఆధార్ సెంటర్‌లలో డిజిటల్ జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ ఉంటేనే తేదీ మార్పు జరుగుతోంది. 2014కి ముందు పుట్టిన విద్యార్థులకు డిజిటల్ సర్టిఫికెట్‌లు లేవు. దీంతో విద్యార్థులు మీసేవ కేంద్రాలు, సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. డిజిటల్ సర్టిఫికెట్ల జారీకి నెల రోజులు వ్యవధి పడుతోంది. ఫలితంగా ఆధార్ కార్డుల్లో దిద్దుబాట్లు జరగక, ఉన్న సర్టిఫికెట్లు పనిచేయక అపార్ నమోదులో జాప్యం తప్పడం లేదు. అపార్ కోసం వివరాల నమోదు ప్రక్రియలో ఇటు ఉపాధ్యాయులకు, తప్పులు సవరణ చేసుకునేందుకు అటు విద్యార్థులతో పాటు,వారి తల్లిదండ్రులకు తిప్పలు తప్పడం లేదు.

సమస్యలు ఉన్న మాట వాస్తవమే



అపార్ నమోదు ప్రక్రియలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమస్యలు ఎదురవుతున్న మాట వాస్తవమే. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నాం. జనన ధ్రువీకరణ పత్రాలు లేని విద్యార్థులు తమ పరిధిలోని సచివాలయాల్లో లేట్‌బర్త్ సర్టిఫికెట్‌కు దరఖాస్తుచేసుకోవాలి. జననధ్రువీకరణ పత్రాల్లో ఏ విధంగా పేరు ఉంటే ఆ విధంగా ఆధార్ కార్డుల్లో పేరు మార్చుకోవాలి.

– కె.గంగరాజు, ఎంఈఓ–2 జామి మండలం

దరఖాస్తు చేశాం..



మా అబ్బాయి జగదీష్ జామి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పుట్టిన తేదీ బర్త్ సర్టిఫికెట్,ఆధార్‌లో వేర్వేరుగా నమోద య్యింది. అవిసరిగా ఉండాలని ఉపాధ్యాయులు అంటున్నారు. వాటిని మార్చుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. సచివాలయంలో లేట్‌బర్త్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేశాం.

– హీరాలాల్, విద్యారి తండ్రి, జామి

నోటరీ చేయించాం..



మాఅబ్బాయికి జనన ధ్రువీకరణ పత్రం లేదు. విశాఖపట్నం కేజీహెచ్‌లో పుట్టాడు. అప్పట్లో మేము బర్త్‌సర్టిఫికెట్ తీసుకోలేదు. ఇప్పుడు ఆ సర్టిఫికెట్ ఉండాలని, అక్కడకి వెళ్లాలని ఉపాధ్యాయులు అంటున్నారు. ఆ సర్టిఫికెట్ తెచ్చుకోవడానికి ఇప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సర్టిఫికెట్ కోసం కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వస్తోంది. నోటరీ అవసరమంటే అది కూడా చేయించాం.

– చుక్క అప్పలరాజు, విద్యార్థి తండ్రి గుడికొమ్ము, జామి మండలం

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరి

ప్రజావసరాలకు అనుగుణంగా గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ బి.సత్యనారాయణ, డిప్యూటీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, ఎంపీడీఓలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు సూచించారు. రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై చీపురుపల్లి, గజపతినగరం, మెరకముడిదాం,గుర్ల, జామి, బొండపల్లి, గంట్యాడ, వేపాడ, లక్కవరపుకోట,కొత్తవలస, గరివిడి మండల కేంద్రాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులతో పాటు ఎంపీపీలు, జెడ్పీటీసీలు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరి అని అన్నా రు. ప్రాధాన్యతా క్రమంలో పనులను గుర్తించి వాటిని ఆన్‌లైన్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

– చీపురుపల్లి/గజపతినగరం/మెరకముడిదాం/గుర్ల/జామి/బొండపల్లి/గంట్యాడ/వేపాడ/లక్కవరపుకోట/కొత్తవలస/చీపురుపల్లి రూరల్(గరివిడి)


గజపతినగరంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ బి.సత్యనారాయణ


చీపురుపల్లిలో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకట్రామన్


జామిలో మాట్లాడుతున్న శిక్షణ రాష్ట్ర పరిశీలకుడు సుబ్బారావు


మెరకముడిదాంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కరరావు


గుర్లలో సూచనలు చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు


కొత్తవలసలో మాట్లాడుతున్న ఎంపీపీ గోపమ్మ


లక్కవరపుకోటలోమాట్లాడుతున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు


వేపాడలో అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచనలు చేస్తున్నఎంపీడీఓ సూర్యనారాయణ


బొండపల్లిలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీపీ చలం నాయుడు,జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు


గంట్యాడలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నరసింహమూర్తి

ప్రణాళికల తయారీపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈశిక్షణ తరగతులను ఎంపీపీ ప్రారంభించి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సూచనలు చేశారు.

ఓటర్ల జాబితా మార్చితే కోర్టును ఆశ్రయిస్తాం


తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు, నాయకులు

దత్తిరాజేరు: త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఇది వరకు ప్రచురించిన ఓటర్ల జాబితాలో ఓటర్ల వివ రాలను వీఆర్‌ఓలు మార్చితే కోర్టును ఆశ్రయిస్తామని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ విజయభాస్కర్‌ను శనివారం ఎంపీపీ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. నీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు. కొన్ని గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల సూచనల మేరకు వీఆర్‌ఓలు అత్యుత్సాహం చూపి ఓటర్ల జాబితాలో పేర్లు మార్చేశారని, అలాంటి వారిని ఉపేక్షించమని అన్నారు. సచివాలయాల వద్ద ప్రదర్శించిన ఓటర్ల జాబితాల్లో ఉన్న పేర్లలో కొన్ని మార్చేశారని, దీనిపై ఇప్పటికే తమ పార్టీ నాయకులు వీఆర్‌ఓలను నిలదీశారని చెప్పారు. తప్పు చేసిన వీఆర్‌ఓలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో తహసీల్దార్ పలువురు వీఆర్‌ఓలకు ఫోన్ చేసి వారి వివరణ కోరారు. తహసీల్దార్‌ని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు మహదేవ్ ఫణీంద్రుడు, దత్తి చిరంజీవి, చప్ప సత్యనారాయణ, సర్పంచ్ రంభ చంద్రశేఖర్ తదితరులున్నారు.

సర్పంచ్‌లకు వినతి


గుర్ల: చింతలపేట సర్పంచ్ భాస్కరరావుకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు


కొత్తవలస: చీడివలస సర్పంచ్ అప్పలనాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

గుర్ల/కొత్తవలస/ వేపాడ: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని కోరుతూ 104 ఉద్యోగులు సర్పంచ్‌లకు శనివారం వినతిపత్రాలు అందజేశా రు. గుర్ల మండలంలోని 104 ఉద్యోగులు చింతలపేట, జమ్ముపేట సర్పంచ్‌లు పతివాడ భాస్కరరావు, కురుమునెల్లి వరలక్ష్మికి, కొత్తవలస మండల ఉద్యోగులు చీడి వలస సర్పంచ్ చలుమూరి అప్పలనాయుడుకి, వేపాడ మండల ఉద్యోగులు నీలకంఠరాజపురం ఉపసర్పంచ్ కండిపల్ల పెదనాయుడును కలిసి వినతిపత్రాలు అందజేసి, తమ సమస్యలను ఏకరువుపెట్టారు. తమకు ప్రతీ నెల సకాలంలో జీతాలు చెల్లించాలని, బీమా సదుపాయం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈనెల 17వ తేదీ వరకు సర్పంచ్‌లకు, 18వ తేదీ నుంచి 20 వరకు ఎంపీపీలు,ఎంపీటీలకు, 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్‌కు వినతిపత్రాలు అందించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని చెప్పారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధంకండి


బొండపల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, పార్టీ మద్దతుదారులైన సర్పంచ్‌లు, పార్టీ శ్రేణు లు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు.స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బొండపల్లి మండల నాయకు లు, ప్రజాప్రతినిధులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బొండపల్లి మండలంలో ప్రధానంగా ఎం.ఎస్.చానల్ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, జరిగిన లబ్ధిని వివరించి ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, పార్టీ రాష్ట్ర నాయకులుబి.వి.ప్రభూజీరాజు,ఎం.నారాయణ మూర్తిరాజు, మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఈదుబిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లో వైద్య శిబిరం


చిన్నారులకు వైద్య పరీక్షలు చేయిస్తున్న చీపురుపల్లి కోర్టు జడ్జి హేమలత

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్‌నగర్‌లోని ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బంది శిబిరంలో వినికిడి లోపం గల 100 మంది పిల్లలకు సాధారణ, నేత్ర,చెవి సంబంధిత వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని చీపురుపల్లి కోర్టు జడ్జి వై.హేమలత పర్యవేక్షించారు. పిల్లలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు.ఫేకర్ సీఈఓ ఎం.ఎస్.ఎస్.శర్మ, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

10 అడుగుల కొండచిలువ హతం



వేపాడ: మండల కేంద్రానికి సమీపంలోని తోము చెరువువద్ద శనివారం సుమారు పది అడుగుల కొండచిలువను రైతులు హతమార్చారు. రైతులు వరికోతలు పూర్తి చేసుకుని ఇళ్లకు వస్తుండగా చెరువు నుంచి రోడ్డుపైకి వస్తున్న కొండచిలువను రైతులు గుర్తించి హతమార్చారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


పడిపూజకు హాజరైన అయ్యప్ప మాలధారణ భక్తులు


పూజలందుకుంటున్న అయ్యప్పస్వామి

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులో ఉన్న మహాశాస్త మణికంఠస్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సంఘం నేతృత్వంలో అయ్యప్ప పడిపూజ శని వారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 6గంటల నుంచి అభిషేకాలు, లక్షబిల్వార్చన, హోమాలు, నారాయణసేవ వంటి కార్యక్రమాలు సాయంత్రం వరకూ సాగాయి. వందలాది మందికి ఉదయం సిద్ధి, మధ్యాహ్నం బిక్షలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6.30 గంటలకు ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ, అయ్యప్ప మండల దీక్షల్లో ఉన్న స్వాములతో పడి పూజ చేయించారు. స్వాముల భక్తిగీతాలు, శరణుఘోషలతో ఆలయ పరిసర ప్రాంగణాలు మార్మోగాయి. స్వాములు, భవానీలతో పాటు పూజకు వచ్చిన భక్తులకు అయ్యప్ప సేవా సమితి సభ్యులు అల్పాహారం అందించారు.

సంక్షిప్తంగా..

కంప్యూటరీకరణ పూర్తిచేయండి


పీఏసీఎస్ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ సేతుమాధవన్

జామి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) రికార్డులు, ఇతర వివరాల కంప్యూటరీకరణ త్వరితగతిన పూర్తిచేయాలని జేసీ సేతు మాధవన్ సిబ్బందికి సూచించారు.మండలంలోని ఏ.ఆర్.పేట పీఏసీఎస్‌ను శనివారం సందర్శించారు. రికార్డుల కంప్యూటరీకరణ ఎంతవరకు పూర్తయింది, తదితర అంశాలపై సిబ్బందిని ఆరాతీశారు. ఈ నెలాఖరులోగా కంప్యూటరీకరణ పూర్తిచేయాలని, రెవెన్యూ పరంగా ఎమైనా సమస్యలు ఉత్పన్నమైతే రెవెన్యూసిబ్బంది సహకారం తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో మొత్తం 61 పీఏసీఎస్‌లు ఉన్నాయని, అన్ని చోట్లా కంప్యూటరీకరణ చేస్తున్నట్లు తెలిపారు. డీసీసీబీ సీఈఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గతంలో పీఏసీఎస్‌లు మాన్యువల్‌గా నడిచేవని, ఇక నుంచి లావాదేవీలు ఆన్‌లైన్‌లో జరగనున్నట్లు తెలిపారు.జేసీ వెంట డీసీఓ పి.రమేష్,తహసీల్దార్ కృష్ణలత ఉన్నారు.

ప్రోటోకాల్ పాటించండి


మాట్లాడుతున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు

దత్తిరాజేరు: ప్రోటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులకు అధికారులు సమాచారం ఇస్తూ ప్రోటోకాల్ పాటించాలని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన శనివారం గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈశిక్షణ తరగతులను ఎంపీపీ ప్రారంభించి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సూచనలు చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీ ఓ బి.కల్యాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

లక్షదీపోత్సవం రేపు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆవరణలో ఈనెల 18న లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు శివభక్త మండలి ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం, 5 గంటలకు కార్తీకమాసం విశిష్టతపై ప్రవచనాలు, 6.30 గంటలకు లక్ష దీపోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు యాదవుల సమావేశం

బొండపల్లి: యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గొల్లలపేట గ్రామంలో ఆదివారం యాదవుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం గజపతినగరం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన పీతల అప్పలనాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు మేకల రాములు యాదవ్, మండే సుభాష్ చంద్రయాదవ్ తో పాటు,రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు శేఖర్ యాదవ్, వీరేంద్ర యాదవ్ హాజరు కానున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని యాదవులు అంతా హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

గ్రంథాలయ ఉద్యమకర్తలకు నివాళులు

శృంగవరపుకోట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ కర్తలు ఎస్.ఆర్.రంగనాథం, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు శనివారం నివాళులు అర్పించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు అధ్యాపకుడు మల్లేశ్వరరావు లైబ్రేరియన్ డి.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.